సాక్షి కామారెడ్డి

ఆదివారం । 27 । జూలై । 2025



పరిధి దాటి వైద్యం చేస్తే..

ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పరిధిని దాటి వైద్యం చేస్తే చర్యలు తప్పవని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు.

- 8లో ▸



అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సలాం సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /22.2

ఆకాశం మేఘావృతమవుతుంది. రోజంతా చల్లని గాలులు వీస్తాయి. అడపాదడపా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి ముగ్గురు గైనకాలజిస్టులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి ముగ్గురు గైనకాలజిస్టులు రానున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిలో గైనకాలజిస్టులు లేకపోవడంతో ప్రసవాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలో వారిని డిప్యూటేషన్‌పై పంపిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. వీరు ఒక్కొక్కరు వారంలో రెండు రోజుల పాటు అందుబాటులో ఉండి సేవలందిస్తారని తెలిపారు. సోమవారం, మంగళవారం దోమకొండ నుంచి డాక్టర్ సరిత, బుధవారం, గురువారం డాక్టర్ పిట్లవార్ స్వప్నాలీ, శుక్రవారం, శనివారం డాక్టర్ ఎక్లారె కపిల్ శివరాజ్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ఆయుష్ ఆస్పత్రులకు వైద్యులు

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఆయుర్వేద, హోమియోపతి, యునానీ ఆస్పత్రులలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసినట్లు ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్ తెలిపారు. దోమకొండ, ఆర్గొండ, పుల్కల్, నాగిరెడ్డిపేట, చిల్లర్గి ఆయుర్వేద ఆస్పత్రులతోపాటు పెల్లారెడ్డి, ఎల్లంపేట హోమియో, జుక్కల్, లింగంపేట, నిజాంసాగర్ యునానీ ఆస్పత్రులకు వైద్యులు వచ్చారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు వీరి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఇంక్రిమెంట్ల లొల్లి!

- రెండో ఇంక్రిమెంట్ ఇవ్వడం లేదని లెక్చరర్ల ఆవేదన
- కమిషనర్ ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్

కామారెడ్డి టౌన్: ఇంక్రిమెంట్ కోసం జూనియర్ లెక్చరర్లు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలు గడిచినా రెండో ఇంక్రిమెంట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నా యి. వాటిలో విధులు నిర్వహిస్తున్న 118 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు 2023 మేలో రెగ్యులర్ అయ్యారు. వీరందరికీ గతేడాది మే 2024లో తొలి ఇంక్రిమెంట్ అందింది. రెండో ఇంక్రిమెంట్ ఈ ఏడాది మే నుంచి అమలులోకి రావాలి. కానీ రెండో ఇంక్రిమెంట్ ఇవ్వకుండా కళాశాలల ప్రిన్సిపాల్స్ అడ్డుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొరుగున ఉన్న నిజామాబాద్ జిల్లాలో బోధన్, వర్ని, కోటగిరి కళాశాలల్లో అక్కడి ప్రిన్సిపాల్స్ మే నుంచి ఇంక్రిమెంట్ చేస్తూ వేతనాలు చెల్లిస్తున్నారని పేర్కొంటున్నారు. జిల్లాలో రెండో ఇంక్రిమెంట్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. రెండో ఇంక్రిమెంట్ అమలు చేయాలని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాలు జారీ చేశారని, దానిని అమలు చేయాలని కోరుతున్నారు.

ఉత్తర్వులు వచ్చాక ఇస్తాం

2023లో క్రమబద్ధీకరణ అయిన లెక్చరర్ల ప్రొబెషనరీ పీరియడ్ పూర్తయ్యింది. అయితే వారికి ఇంకా రెగ్యులర్ ఉత్తర్వులు రాలేదు. ఆ ఉత్తర్వులు వచ్చాక రెండో ఇంక్రిమెంట్ ఇస్తాం. – షేక్ సలాం, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి



అలుగు పారుతున్న పోతాయిపల్లి పెకుల చెరువు

కరుణించిన వరుణుడు

వర్షాకాలంలో సరైన వానలు లేక ఆకాశం కేసి ఆశగా చూస్తున్న అన్నదాతలపై వరుణుడు కరుణ చూపాడు. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. వాగులు, వంకలు పొంగుతుండడంతో చెరువులు నిండుతూ అలుగులు పారుతున్నాయి. వాగుల ప్రవాహంతో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



ఉధృతంగా ప్రవహిస్తున్న సింగితం వాగు



అలుగు పారుతున్న షేర్‌ఖాన్‌పల్లి మత్తడి

- కురుస్తున్న వానలు.. ఉప్పొంగుతున్న వాగులు
- అలుగులు పారుతున్న చెరువులు
- జలకళ సంతరించుకుంటున్న నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులు
- పలుచోట్ల రాకపోకలకు ఇబ్బందులు

వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందు భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఈసారి కాలం బాగుంటుందని రైతులు ఆశించారు. అయితే వానాకాలం మొదలయ్యాక వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో వేసిన పంటలకు నీరందక రైతులు ఆందోళనకు గురయ్యారు. పలువురు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా ముసురు పెట్టడంతోపాటు అడపాదడపా కురుస్తున్న ఓ మోస్తరునుంచి భారీ వర్షాలతో జిల్లా అంతటా జలకళ సంతరించుకుంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా అంతటా వర్షం కురిసింది. గాంధారిలో అత్యధికంగా 66.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. అత్యల్పంగా మాచాపూర్‌లో 2.8 మి.మీటర్లు రికార్డయ్యింది.



ఎర్రాపహాడ్‌లో వర్షానికి కూలిన ఇల్లు

రాకపోకలకు అంతరాయం..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. సదాశివనాగర్ మండలం అమర్లబండ వాగు పొంగి ప్రవహించడంతో ధర్మరావుపేటలోని పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు వాగు దాటలేకపోయారు. దీంతో వారిని ట్రాక్టర్ సాయంతో వాగు దాటించారు. మద్నూర్ మండలంలో లింబూర్‌వాడి వద్ద వాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాడ్వాయి మండలం దేమికలాన్, కన్కల్ గ్రామాల మధ్య వాగు ప్రవహించింది. లింగంపేట మండలంలోని పెద్ద వాగు ప్రవాహంతో చుట్టుపక్కల గ్రామాల్లోని చెరువులకు వరదనీరు వచ్చి చేరుతోంది. పాల్వంచ మండలంలోని పాల్వంచ వాగులో ప్రవాహం పెరిగింది. కామారెడ్డి నుంచి రామారెడ్డి మధ్యలో ఉన్న గంగమ్మ వాగు వంతెన పనులు పూర్తి కాకపోవడం, తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు కోతకు గురి కావడంతో రాకపోకలు నిలిపివేశారు. వాహనాలను పోసానిపేట మీదుగా మళ్లిస్తున్నారు. తాడ్వాయి మండలం సోమారం గ్రామ శివారులో బతుకమ్మ వాగు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులను ట్రాక్టర్‌పై తరలించారు. దేమికలాన్ –కన్కల్ రోడ్డులో ఉన్న వాగు పొంగి పొర్లడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. బ్రాహ్మణపల్లి శివారులో నూతనంగా నిర్మించిన రెండు బ్రిడ్జిల వద్ద రోడ్డు కోతకు గురవుతోంది. తాడ్వాయి మండలంలో పలు ఇళ్లు కూలిపోయాయి. ఎర్రాపహాడ్‌లో గంగి మల్లుబాయి, కరడ్‌పల్లిలో చంద్రకళ, బ్రహ్మాజీవాడిలో అంతంపల్లి లచ్చవ్వ, కర్రొల్ల కనకవ్వల ఇళ్లు దెబ్బతిన్నాయి.



పొంగి ప్రవహిస్తున్న లింగంపేట పెద్దవాగు



కన్‌కల్-దేమికలాన్‌లో పారుతున్న వాగు

నిండిన కల్యాణి ప్రాజెక్టు

ఎల్లారెడ్డి: తిమ్మారెడ్డి గ్రామ శివారులోని కల్యాణి ప్రాజెక్టు నిండడంతో శనివారం రెండు వరద గేట్లను ఎత్తినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు కల్యాణి వాగు ద్వారా 640 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని, దీంతో రెండు వరద గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 408.5 మీటర్లతో నిండుకుండలా ఉందని తెలిపారు.

పోచారంలోకి 9వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట: ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి 9,100 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.820 టీఎంసీలు కాగా.. శనివారం రాత్రి వరకు 0.830 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.



కల్యాణి గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్‌లోకి 1,625 క్యూసెక్కులు..

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం 1,625 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాలతో పాటు ఘనపురం ఆనకట్ట, క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,390.66 అడుగుల (4.321 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు.

ఉధృతంగా పారిన వాగులు



ధర్మారావుపేట నుంచి అమర్లబండకు కేజీవీల్ ట్రాక్టర్‌పై విద్యార్థులను తరలిస్తున్న దృశ్యం



సోమారం శివారులోని వాగులోంచి ప్రజలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న స్థానికులు

- ట్రాక్టర్లపై వాగులు దాటించిన స్థానికులు

సదాశివనగర్: అమర్లబండ, ధర్మారావుపేట్ గ్రామాల మధ్యనున్న వాగు పొంగి పొర్లడంతో శనివారం సాయంత్రం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అమర్లబండకు చెందిన విద్యార్థులు ధర్మారావుపేటలో చదువుకుంటారు. వారంతా వాగు దాటలేకపోయారు. దీంతో వారిని కేజీవీల్ ట్రాక్టర్‌పై వాగు దాటించారు.



కాటెవాడి వాగు దాటుతున్న తండావాసులు

సోమారం వాగు వద్ద..

తాడ్వాయి : సోమారం వాగు ఉధృతంగా పారడంతో గంటపాటు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో స్థానికులు వారిని ట్రాక్టర్లలో వాగు దాటించారు.

కాటెవాడి వాగు..

గాంధారి: కాటెవాడి వాగు ఉధృతంగా ప్రవహించడంతో కాటెవాడి తండాకు చెందిన వ్యవసాయ కూలీలు ఇబ్బందిపడ్డారు. కాటెవాడి తండాకు చెందిన 30 మంది వ్యవసాయ కూలీలు శనివారం పాతంగల్ ఖుర్దు గ్రామానికి వరి నాట్లు వేయడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వాగు ఉధృతంగా పారడంతో అవతలి ఒడ్డున నిలిచిపోయారు. లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో సుమారు రెండుమూడు గంటలపాటు నిరీక్షించారు. ప్రవాహ ఉధృతి తగ్గిన తర్వాత ఒకరి సహాయంతో ఒకరు వాగు దాటి సురక్షితంగా తండాకు చేరుకున్నారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నమోదైన వర్షపాతం వివరాలు..

ప్రాంతం	వర్షపాతం(మి.మీ.)	ప్రాంతం	వర్షపాతం(మి.మీ.)	ప్రాంతం	వర్షపాతం(మి.మీ.)
గాంధారి	66.8	తాడ్వాయి	44	లింగంపేట	32.8
మేనూర్	60.8	రామలక్ష్మణ్‌పల్లి	43.8	పాతరాజంపేట	32.5
మక్దుంపూర్	56.3	జుక్కల్	41.3	భిక్కనూరు	30.5
కొల్లూరు	54.0	లచ్చాపేట	41	దోమకొండ	29.5
సోమూర్	51.8	సదాశివనగర్	40.5	బీబీపేట	22.5
పుల్కల్	49.3	ఇసాయిపేట	39.3	పెద్దకొడప్‌గల్	21.8
నస్రుల్లాబాద్	49.3	బొమ్మన్‌దేవ్‌పల్లి	37.8	హసన్‌పల్లి	19
కామారెడ్డి	47.8	ఎల్పుగొండ	37.3	పిట్లం	17.5
డోంగ్లీ	47.0	అర్గొండ	34	నాగిరెడ్డిపేట	14.5
బీర్కూర్	45.5	రామారెడ్డి	33.3	మాచాపూర్	2.8

నాన్నకు ప్రేమతో..

అల్లారుముద్దుగా పెంచి, పెద్దచేసిన తండ్రి మరణం ఆమెను ఎంతో వేదనకు గురిచేసింది. నాన్న భౌతికంగా దూరమైనా ఆయన జ్ఞాపకాలతో గడుపుతున్న కూతురు.. ఆయన విగ్రహాన్ని తయారు చేయించింది. గుడి కట్టించి ఇటీవలే అందులో ప్రతిష్ఠింపజేసింది. రోజూ పొలం వద్దకు వెళ్లి తండ్రి విగ్రహాన్ని చూస్తూ ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ గడుపుతోంది. నాన్నకు ప్రేమతో గుడి కట్టించిన కూతురుపై కథనం.. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



మెంగె హన్మంతరావు ప్రతిమతో కూతురు అల్క

- గుడి కట్టించిన కూతురు
- జీవం ఉట్టిపడే విగ్రహం ఏర్పాటు
- రూ. 20 లక్షలకుపైగా ఖర్చు..

సండే స్పెషల్

డోంగ్లీ మండలకేంద్రానికి చెందిన మెంగె హన్మంతరావుది వ్యవసాయ కుటుంబం. ఆయనకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు కొంత ఆరోగ్య సమస్యలతో బాధపడుతోంది. చిన్న కూతురు అల్కకు 2013లో వివాహం చేసిన హన్మంతరావు.. అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నాడు. కుటుంబ సభ్యులందరూ వ్యవసాయ పనులు చూసుకుంటారు. 2023 జూలై 21న హన్మంతరావు చనిపోయారు. తండ్రి మరణంతో కూతురు అల్క ఎంతో ఆవేదనకు గురైంది. భర్తతో చర్చించి, తండ్రి లేని లోటు కనిపించకుండా ఉండేందుకు ఆయనకు గుడి కట్టించాలని నిర్ణయించుకుంది.



తండ్రి కోసం కూతురు నిర్మించిన గుడి

ముంబయి నుంచి..

ముంబయిలో సిలికాన్‌తో అచ్చం మనిషిలా కనిపించేలా విగ్రహం తయారు చేస్తారని తెలుసుకుని అక్కడికి వెళ్లి తండ్రి బతికి ఉన్నప్పుడు ఊయలలో ఊగుతున్న ఫొటోలను చూపించింది. విగ్రహం కోసం రూ.10 లక్షల వరకు వెచ్చించింది. ఊరి శివారులో ప్రధాన రహదారి వెంట ఉన్న తమ పొలం వద్ద రూ. 10 లక్షలతో గుడి కట్టించింది. ఈనెల 21న ఇంటి నుంచి పొలం వరకు బంధువులతో కలిసి బాజాభజంత్రీలతో వెళ్లి, విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అక్కడికి వెళ్లి విగ్రహాన్ని చూసినవారు ఆశ్చర్య చకితులవుతున్నారు. హన్మంతరావు బతికే ఉన్నాడనేలా విగ్రహం ఉందంటూ మెచ్చుకుంటున్నారు. తండ్రికి గుడి కట్టించి విగ్రహం చేయించిన కూతురు, అల్లుడు గొప్పతనాన్ని పలువురు అభినందించారు.

నాన్నతో ఉన్నట్లే అనిపిస్తుంది



మా ఉన్నతి కోసం నాన్న ఎంతో కష్టపడ్డారు. అందరం బాగున్నాం. ఆయన చనిపోవడం మా కుటుంబానికి ఎంతో లోటు. నాన్న లేరన్న విషయాన్ని తట్టుకోలేకపోయా. నాన్న రూపాన్ని చూసుకోవాలని అనుకుని విగ్రహం చేయించాం. పొలం దగ్గర గుడి కట్టించి, అందులో నాన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. అక్కడికి వెళ్తే నాన్నతో ఉన్నట్లే ఉంటుంది. మరో జన్మంటూ ఉంటే ఆయనకు మళ్లీ కూతురుగా పుట్టాలన్నదే నా కోరిక.

– అల్క, హన్మంతరావు కూతురు

వ్యాధులు ప్రబలకుండా చూడండి

- అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలి
- అవసరమైతే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలి
- యూరియా కొరత లేకుండా చూడండి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు

భిక్కనూరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. శనివారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రత్యేక అధికారిగా నియమితులైన తర్వాత మొదటిసారిగా జిల్లాకు వచ్చిన ఆయనకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్‌గాంధీ హనుమంతు ఆస్పత్రిలోని వివిధ విభాగాలను, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్ ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల కలిగే వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. అవసరమైతే గ్రామాలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు సూచించారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరదల ద్వారా సంభవించే సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఏవో మోహన్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, మండల వైద్యాధికారి ఎమీమా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

'క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి'

కామారెడ్డి అర్బన్: క్యాన్సర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం జిల్లాకేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో రోటరీ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కిమ్స్‌ల ఆధ్వర్యంలో ఉచిత క్యానర్స్ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. దాదాపు 300 మందికి పరీక్షలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలు నిర్వహించి పేదలకు మేలు చేయాలన్నారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ద్వారా సులభంగా నయం చేయవచ్చనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ప్రమీల, కిమ్స్ వైద్యుడు మధు దేవరశెట్టి, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి, ఐఎంఏ ప్రతినిధులు అరవింద్, రవీందర్‌రెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు శంకర్, కృష్ణహరి, వెంకటరమణ, రాజనర్సింహారెడ్డి, బాలరాజు, నాగభూషణం, సుధాకర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంగ్వాన్

ప్రాణదానంతో సమానం

కామారెడ్డి క్రైం: రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది రక్తదానంలో కామారెడ్డి జిల్లాకు మంచి గుర్తింపు లభించిందన్నారు. ఈసారీ రక్త సేకరణలో ముందుండాలన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్నలను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, భూగర్భజల శాఖ ఏడీ సతీష్ యాదవ్, బీసీ వెల్ఫేర్ అధికారి షకీల్, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రఘు కుమార్, డీసీవో శ్రీలత పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సంతాయిపేట్, నందివాడలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ వారికి పార్టీ కండువ కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల పరిసరాలతో పాటు గ్రామాల్లో ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సిటీజన్స్ అభిప్రాయాలను సేకరించి ఆన్‌లైన్లో నమోదు చేశారు. గోపాల్‌పేట హైస్కూల్ హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

యోగాను క్రీడగా గుర్తించి, అభివృద్ధి చేయాలి



కామారెడ్డి అర్బన్: అన్ని రాష్ట్రాల్లోనూ యోగాను క్రీడగా గుర్తించి అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి అన్నారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డిని శనివారం వారు ఎల్‌బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో కలిశారు. యోగా అభివృద్ధికి యువత, మహిళల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. రాష్ట్ర ప్రతినిధులు తోట సతీష్, డాక్టర్ సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రపతి నిలయంలో జిల్లా విద్యార్థుల నృత్యప్రదర్శన



మాచారెడ్డి: హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండలంలోని సోమారంపేట ఉన్నత పాఠశాల విద్యార్థినులు నృత్య ప్రదర్శన చేశారు. రాష్ట్రపతి నిలయంలో ప్రతి ఏడాది నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఈసారి తమ పాఠశాల విద్యార్థులకు అవకాశం రావడంపై హెచ్‌ఎం భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. నృత్య ప్రదర్శనతోపాటు రంగోలి, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనడానికి 15 మంది విద్యార్థినులు వ్యాయామ ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నట్లు హెచ్‌ఎం వివరించారు.

దంత వైద్య సేవలు అంతంతే

- బాన్సువాడ ఎంసీహెచ్‌లోని డెంటల్ విభాగంలో వేధిస్తున్న పరికరాల కొరత
- పట్టించుకోని అధికారులు



బాన్సువాడ ఎంసీహెచ్‌లోని దంత వైద్య విభాగం

బాన్సువాడ: పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి(ఎంసీహెచ్)లోగల డెంటల్ విభాగంలో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. మానవ శరీరంలో అన్ని అవయవాల మాదిరిగానే దంతాలకు సైతం సమస్యలు వస్తుంటాయి. అయితే దంత సమస్యలు త్వరగా నయం కావు. ఇందుకోసం వివిధ దశల్లో చికిత్స చేయించుకోవాల్సి ఉంటుంది. అలా జరగకపోతే ఇతర సమస్యలు వచ్చే ప్రమాదముంది. ఈక్రమంలో బాన్సువాడలోని ప్రభుత్వ డెంటల్ విభాగంలో దంత సమస్యతో బాధపడే వారికి ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యం అందడం లేదు. దీంతో పలువురు తప్పనిసరై ప్రయివేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు.

రోజుకు పదుల సంఖ్యలో రోగులు..

వయస్సుతో సంబంధం లేకుండా ఇటీవల దంత సమస్యతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. బాన్సువాడ ఎంసీహెచ్‌లో ఓపీకి నిత్యం వివిధ సమస్యలతో 600 నుంచి 700 మంది వస్తుండగా, దంత సంబంధిత చికిత్స కోసం వచ్చే వారి సంఖ 10-15 పైనే ఉంటుంది. కానీ ఇక్కడ సాధారణ చికిత్సలే తప్ప మెరుగైన వైద్యం అందకపోవడంతో నానాటికీ ఓపీ తగ్గుతోంది. ఆధునిక పరికరాలు లేకపోవడంతో పళ్ల తొలగించడం, కొత్తవి అమర్చడం వంటి మైనర్ చికిత్సలే జరుగుతున్నాయి. దీనికి తోడు చికిత్సకు ఉపయోగించే కుర్చీ పాడవడంతో సేవలు మరింత మృగ్యమయ్యాయి. ఈ విభాగంలో రూట్ కెనాల్, టీత్ క్లీనింగ్, దంతాల ఫిల్లింగ్, కాస్మొటిక్స్ తదితర చికిత్స అందించాల్సి ఉంటుంది. కానీ అందుకు సంబంధించి పరికరాలు సమకూర్చక, నిపుణులైన వైద్యులు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే వారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. దంత విభాగంలో చైర్, మౌత్ మిర్రర్, డిజిటల్ ఎక్స్‌రే, ప్రొబ్, ఓరల్‌కెమెరా, అల్ట్రాసోనిక్ స్కేలర్, పాలిషింగ్ బ్రష్ తదితర పరికరాలు లేకపోవడం, చైర్ కూడా చిన్నదిగా ఉండడంతో సేవలు నానాటికీ తగ్గిపోతున్నాయి. ఈక్రమంలో దంత సమస్యలతో వచ్చే వారికి వైద్యులు నొప్పి నివారణ మాత్రలు రాసి పంపిస్తుండడంతో 5-10 మందికి మించి రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్ని పరికరాలు సమకూర్చితే పేదలకు మెరుగైన వైద్యం అందుతాయని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

దంత వైద్య పరికరాలు సమకూర్చడం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం సాధారణ చికిత్సలే అందుతున్నాయి. ఆధునిక పరికరాలు తెప్పించి మిగతా చికిత్సలు చేస్తాం. శస్త్ర చికిత్సలకు సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రిలో పరికరాలు అందుబాటులో ఉండవు.

–విజయలక్ష్మి సూపరింటెండెంట్, మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి, బాన్సువాడ

పరిధికి మించి వైద్యం చేస్తే చర్యలు



బాన్సువాడలో పీఎంపీ, ఆర్‌ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ: పీఎంపీ, ఆర్‌ఎంపీలు తమ పరిధిని దాటి వైద్యం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. బాన్సువాడలో శనివారం ఆమె పీఎంపీ, ఆర్‌ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైద్యం కోసం పీఎంపీ, ఆర్‌ఎంపీల వద్దకు రోగులు వస్తే యాంటీబైటిక్స్, స్టెరాయిడ్స్, ఐవీ ఫ్లూయిడ్స్‌ను ఎక్కించవద్దని సూచించారు. ఎవరైనా తమ పరిధి దాటి వైద్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్య సిబ్బంది దయానంద్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలి



సదాశివనగర్‌లో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తగా పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో చేపడుతున్న పారిశుద్ధ్య నిర్వహణ తీరును శనివారం ఆయన పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌ను ఆదేశించారు. ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు పద్మావతి పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

ఎల్లారెడ్డిరూరల్: ఆస్పత్రిలో సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆర్డీవో పార్థసింహారెడ్డి ఆదేశించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. మందుల కొరత ఉంటే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి..

వర్షాలు అధికంగా కురుస్తున్న దృశ్యా అధికారులందరూ అందుబాటులో ఉండాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్సులో మాట్లాడారు. వాగులు పొంగే ప్రాంతాలలో సిబ్బంది 24 గంటలు విధులు నిర్వర్తించాలన్నారు.

ఆంజనేయులు మృతి పార్టీకి తీరని లోటు



కామారెడ్డి క్రైం: తాజా మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ కామారెడ్డి మండల అధ్యక్షుడు పిప్పిరి ఆంజనేయులు మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మాజీ ఎంపీపీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆంజనేయులు పార్థీవ దేహానికి పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం ఆయన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, పార్టీ శ్రేణులతో కలిసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

నస్రుల్లాబాద్ పోలీసు స్టేషన్ తనిఖీ

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య శనివారం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కేసుల పురోగతి సాధించాలన్నారు. పెండింగ్ కేసులను వెంటనే దర్యాప్తు చేసి పూర్తి చేయాలని సూచించారు. ఎస్సై రాఘువేంద్ర, కానిస్టేబుల్‌లు ఉన్నారు.

మాలల ఆత్మీయ సమ్మేళనం వాయిదా



బాన్సువాడ రూరల్: బాన్సువాడలోని మీనాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు తెలంగాణ మాల సంఘం వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ తెలిపారు. బాన్సువాడలో శనివారం ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. త్వరలోనే మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమావేశం తేదీ,వేదికను ప్రకటిస్తామన్నారు. డివిజన్ అధ్యక్షుడు మిర్జాపురం సాయన్న, నాయకులు భూమేష్, రాములు, సైదయ్య, గంగారాం ఉన్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పిస్తాం



బిచ్కుంద: మండలంలోని రైతులకు మార్కెట్ కమిటీ ద్వార అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని బిచ్కుంద ఏఎంసీ చైర్‌పర్సన్ కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిచ్కుంద మార్కెట్ కమిటీకి ఇటీవల రూ.కోటి 12లక్షల నిధులు మంజూరు చేయడంతో శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు చిత్రపటాలకు ఏఎంసీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో రైతులు పంటలు ఆరబెట్టడానికి ప్లాట్‌ఫాంలు, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి ఇతర అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. వైస్ చైర్మన్ శంకర్ పటేల్, నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, గోపాల్‌రెడ్డి, గంగాధర్, నాగ్‌నాథ్ పటేల్, రవి, అశోక్, భాస్కర్‌రెడ్డి, నౌషా నాయక్ పాల్గొన్నారు.

నీటి మట్టానికి, నిల్వకు ఎంతో తేడా!

మీకు తెలుసా?



శ్రీరాంసాగర్ జలాశయం

జలాశయాల్లో నీటి మట్టానికి, నీటి నిల్వకు ఎంతో తేడా ఉంటుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం 1091 అడుగులు కాగా నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు ఉంటుంది.

- ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1070 అడుగుల నీటి మట్టం ఉంది. కానీ, నీటి నిల్వ మాత్రం 22 టీఎంసీలు ఉంది.
- నీటి మట్టం మరో 21 అడుగులకు చేరితే ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతుంది. 21 అడుగులే కదా పెద్ద కష్టమేమీ కాదులే అని అంతా భావిస్తారు.
- ప్రాజెక్ట్ నీటి మట్టం పెరిగిన కొలదీ విస్తీర్ణం పెరుగుతుంది. దీంతో ఒక్కో అడుగుకు ఎక్కువగా నీరు నిల్వ ఉంటుంది. చివరి మూడు అడుగుల్లో ఒక్కో అడుగుకు 6 టీఎంసీల నీరు అవసరమవుతుంది.
- ప్రాజెక్ట్ నీటి మట్టం 1045 అడుగుల నుంచి ప్రారంభమైంది. నీటి నిల్వ సామర్థ్యం 1 టీఎంసీల నుంచే ప్రారంభమవుతుంది.

– బాల్కొండ

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



దేవునిపల్లిలో మున్నూరుకాపు సంఘాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



రాజీవ్‌నగర్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి తన వ్యక్తిగత నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం ప్రారంభోత్సవం చేశారు. నియోజకవర్గంలోని జిల్లాకేంద్రంతోపాటు వివిధ మండలాల్లో కుల సంఘాల భవనాలు, ఫంక్షన్ హాళ్లు, ఆలయాల భవనాలను శనివారం జోరువాన కురుస్తున్నప్పటికీ సమయానికి హాజరై ప్రారంభించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు పట్టణ పరిధిలో దాదాపు 44 భవనాలను ఎమ్మెల్యే తన పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, నాయకులు నరేందర్‌రెడ్డి, విపుల్‌జైన్, నందివేణు, శ్రీకాంత్, ముదాం రాజగోపాల్, చినోళ్ల రజనీకాంత్, కాసర్ల రవీందర్ తదితరులున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పరిశీలించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విధుల్లో చేరిన ఈ-పంచాయతీ ఆపరేటర్లు



కామారెడ్డిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లు

కామారెడ్డి క్రైం/ఎల్లారెడ్డి/బాన్సువాడ రూరల్: తమ డిమాండ్‌ల సాధన కోసం 5 రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన బాటపట్టిన ఈ-పంచాయతీ ఆపరేటర్‌లు శనివారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. దీంతో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు విధుల్లో చేరుతున్నామని ఈ- పంచాయతీ ఆపరేటర్‌ల సంఘం జిల్లా ప్రతినిధులు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్‌ను కలిసి పని ఒత్తిడిని తగ్గించాలని, తక్కువగా వస్తున్న రూ.3 వేల వేతనాన్ని జీపీ నిధుల్లో నుంచి సర్దుబాటు చేసి ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు.

దాబాలపై పోలీసుల దాడులు

ఎల్లారెడ్డి: అనుమతులు లేకుండా దాబాలలో మద్యం సేవిస్తున్నారన్న సమాచారం మేరకు ఎల్లారెడ్డి మండలంలోని పలు దాబాలపై పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. పట్టణంలోని సాయి అన్నపూర్ణ దాబా, లక్ష్మాపూర్‌లోని శ్రీమాత దాబాల్లో ఎస్సై మహేశ్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. దాబా యజమానులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'విదేశీ విద్య' పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాలలో చదివేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు సంబంధిత యూనివర్సిటీ అడ్మిషన్, వీసా, ఇన్‌కం సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. వచ్చే నెల 31 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యువకుడికి డాక్టరేట్



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం పోతాయిపల్లి గ్రామానికి చెందిన నీరడి సూర్యం శనివారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొత్త లక్ష్మా రెడ్డి పర్యవేక్షణలో ' సింథసిస్, క్యారెక్టరైజేషన్ ఆప్టికల్, మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఫొటోక్యాటలిటిక్ అండ్ బయాలజీకల్ యాక్టివిటీ ఆఫ్ మాంగనీస్,ఎటర్బియం,యట్రియం,నియోడైమియం అండ్ డిస్ప్రోసియమ్ డోప్ట్ కో బాల్ట్ నానోఫెరైట్స్''అనే అంశంపై పరిశోధన చేసినట్లు సూర్యం తెలిపారు.కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ జాతీయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామ శివారులో విద్యుత్ షాక్‌తో శనివారం గేదె మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలోని తడికొప్పుల సంగమేశ్‌కు చెందిన గేదె మేత మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన ఎర్తింగ్ వైరుకు తగలడంతో షాక్‌తో మరణించిందని బాధితుడు పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

రుద్రూర్: పోతంగల్ మండలం కొల్లూర్ గ్రామశివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని శనివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. లారీని కోటగిరి పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జానకంపేటలో చోరీ



బోధన్: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన మిద్దె గోదావరి ఇంట్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని బీరువాను పగులగొట్టి 8 గ్రాముల బంగారు, 10 తులాల వెండి నగలు అపహరించినట్లు బాధితురాలు తెలిపారు. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్ అపహరణ

నవీపేట: మండల కేంద్రంలో శనివారం జరిగిన మేకల సంతలో బైక్ చోరీకి గురైంది. రెంజల్ మండల కేంద్రానికి చెందిన ఆనంద్ మేకల కొనుగోలు కోసం వచ్చి సంత ప్రాంగణంలో బైక్‌ను పార్కింగ్ చేసి లోపలికి వెళ్లాడు. అరగంట తర్వాత వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన సౌందర్య (20) అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో సౌందర్య బయటికి వెళ్లిందన్నారు. తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లారెడ్డిలో కుక్కల స్వైర విహారం

- ఎనిమిది మందిపై దాడి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో కుక్కలు స్వైర విహారం చేస్తూ ఎనిమిది మందిపై దాడి చేశాయి. పట్టణంలోని ఇందిరానగర్, గాంధీనగర్ కాలనీలో పనులు చేసుకుంటున్న గోపాల్, హర్షిత, శివ రాములు, హఫీజ్, సంగయ్య, మైస కళ, రాములు, మణెవ్వలను కుక్కలు కరిచాయి. కుక్కల దాడిలో గాయపడిన వారంతా ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఎల్లారెడ్డిలో కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు

- త్రుటిలో తప్పిన ప్రమాదం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు శనివారం త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కామారెడ్డికి 70 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగంలోని టైరు హాజీపూర్ శివారుకు రాగానే పేలింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును అదుపు చేశాడు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్య

మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ మండలం బెజ్జోరా మాజీ సర్పంచ్ కోగూరు ప్రతిభ(35) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం పోలీసులకు మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో భీమ్‌గల్ ఎస్సై సందీప్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతురాలు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అమర జవాన్ల త్యాగాలను మర్చిపోలేం

- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరులకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, నేతలు

సుభాష్‌నగర్: దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్ల త్యాగాలను మర్చిపోలేమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, సమర్పణ భావన పెంపొందించడానికి కార్గిల్ విజయ్ దివస్ స్ఫూర్తిదాయక ఘట్టంగా నిలుస్తుందని తెలిపారు. శనివారం కార్గిల్ విజయ దివస్ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారితో కలిసి నగరంలోని ఎల్లమ్మగుట్ట చౌరస్తాలో కార్గిల్ స్మారక స్తూపం వద్ద వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ భారత భూభాగం నుంచి కశ్మీర్‌ను వేరు చేయాలనే ఉద్దేశంతో పాకిస్తాన్ కార్గిల్ జిల్లా పర్వతాల ఆక్రమణను ఆపరేషన్ విజయ్ పేరుతో సైన్యం తిప్పికొట్టిందని గుర్తుచేశారు. దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ పాకిస్తాన్ దురాక్రమణను తిప్పికొట్టి, కార్గిల్ పర్వతాలపై భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసిన జవాన్ల ధైర్యం, నిబద్ధత ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మల్లేశ్ యాదవ్, నాగరాజు, దొంతుల రవి, పంచరెడ్డి శ్రీధర్, పడాల భూపతి, హరీశ్‌రెడ్డి, మెట్టు విజయ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు



మహమ్మదీ(ఫైల్)



బస్సు ఢీకొనడంతో ధ్వంసమైన కారు

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ చౌరస్తా వద్ద 63వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ మహమ్మదీ(56), కుమారుడు షేక్ సోహెల్, కోడలు సాదియా, ఇద్దరు పిల్లలను తీసుకొని కారులో నిజామాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్తున్నారు. దాస్‌నగర్ చౌరస్తా వద్ద కారును నిజామాబాద్ వైపు మలుపుతుండగా నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న సోహెల్, మహమ్మదీ, సాదియా, పిల్లలకు తీవ్రగాయాలై కారులోనే ఇరుక్కుపోయారు. స్థానికులు గమనించి కారు డోర్లను పగులకొట్టి గాయపడిన వారిని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా, మార్గమధ్యలోనే మహమ్మదీ మరణించింది. మిగతా నలుగురు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి భర్త షేక్ అహ్మద్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.